# 'మేడ్... మేడ్... మేడ్... ఫూల్'

మహానగరంలో ఓ ప్రముఖ బిజినెస్ సెంటర్.

రూపాయి నోట్లు జోరుగా చేతులు మారే వేళ—

సిటీబస్‌స్టాప్ దగ్గర రద్దీగా వుంది. బస్సులు ఆగుతున్నాయ్. వెళ్తున్నాయ్. పరుగు పందేలు... పరమ పదసోపానంలో నిచ్చెన లెక్కేవాళ్ళు - పాముసోట్లో పడేవాళ్ళు-

ఆ అమ్మాయి బస్ దిగింది. కాస్త ముందుకు నడిచి మరో బస్‌స్టాప్ వద్ద నిల్చుంది. ఆమె నడిచినంత మేరా ఫారెన్ సెంటు సుగంధం గుప్పుమంది. షాపుల్లో వ్యాపారం క్షణకాలం ఆగింది.

పచ్చటి పూలున్న ఎర్రటి చీరలో తెల్లని దేహవర్ణం గల ఆమె మెరిసి పోతున్నది.

అందానికి అందం- నాజూక్కు నాజూకు--

ఎవరీ సౌందర్యరాశి?

అయిదు...పది--పదిహేను నిముషాలు-

నల్లటి వో కారు వచ్చి ఆ యువతినిల్చున్న చోటున రోడ్డువారగా ఆగింది. కారులోవున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు దిగేరు. ఆమెకు అటు పక్క వొకడు ఇటు పక్క వొకడు నిలబడి ఆమెతో ఏదో మాట్లాడేరు. ఆమె వాళ్ళు మాట్లాడినంతసేపు తల అడ్డంగా వూపుతూనే వుంది.

యింతలో హఠాత్తుగా ఆ వ్యక్తులిద్దరూ ఆమెను నిల్చున్న దాన్ని నిల్చున్నట్లుగా చెరో వైపు పట్టుకొని ఎత్తేరు. కారు బేక్ సీటులోకి తీసు కెళ్ళారు. ఆమె అరుస్తోంది. కాళ్ళూ చేతులు గింజుకొంటోంది.

అందరి దృష్టి అటువైపు. స్థాణువులై చూస్తున్నారు.

కారు ముందుకు దూసుకుపోయి క్షణంలో అదృశ్యమయింది.

ఆశ్చర్యపోయి తేరుకొని వొక్క క్షణం ఆలోచనలో పడ్డ ఆ సెంటర్, ఆ వొక్క నిముషం తర్వాత యధాప్రకారం బిజీ అయింది.

★——★——★

ఆ సెంటర్ కాస్తంత వూపిరి పీల్చుకొని విశ్రాంతి తీసు కొంటూంది.

''సార్, ఎర్రటిచీరకట్టుకొన్న వో అమ్మాయి యీ బస్‌స్టాప్ దగ్గర నిల్చోటం మీరు చూశారా ఇవాళ'' యువకుడొకడు అడిగాడు.

''ఎర్ర చీర ....ఫారెన్ సెంటు - ఊ....చూస్తే?''

''ఆమె నా భార్య. మేమిద్దరం వో చోట కల్సుకుందామనుకున్నాం. తను వస్తున్నట్లు నా భార్య బయలుదేరేక ఫోన్‌చేసింది. ఎంతకీ రాలేదు. మూడు గంటలు ఎదురుచూసి ఆమె

కోసం వెతుక్కుంటూ బయలుదేరేను. ప్లీజ్ కొంచెం గుర్తు చేసుకొని చెప్పరూ?''

వాళ్ళు తాము చూచింది చెప్పేరు.

''అయ్యో, నాకొంప మునిగింది. నా భార్యను ఎవరో నట్ట నడి బజార్లో పట్టపగలు అపహరించుకు పోయారు. నా రూపను వదిలి నేనెలా వుండగలను? రూపా... రూపా... ఎక్కడున్నావ్? ఏంచేస్తున్నావ్?'' అతను ఏడుస్తూ ఫెయింట్ అయ్యాడు.

జనం 'ఓహో! ఎంతప్రేమ భార్యపైన?' అనుకొని అతనికి ఉపచారాలుచేసి స్పృహ తెప్పించి పోలీస్ స్టేషనుకు తీసుకెళ్ళి రిపోర్టు ఇప్పించారు.

★——★——★

''ఇన్‌స్పెక్టర్ గారూ, రూపను నేను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాను. మా పెళ్ళయి ఇంకా ఆరునెలలు నిండలేదు. అప్పుడే ఇంత ఉపద్రవం ముంచుకొస్తుందనుకోలేదు. నా రూపను నాకు భద్రంగా అప్పచెప్పే పూచీ మీదే. నేను ఆత్మ హత్య చేసుకోకుండా రక్షించే బాధ్యతకూడా మీదే-''

''మిస్టర్ సుధీర్. మీరు మరీ అంత అప్‌సెట్ అవుతే ఎలా? రిపోర్టిచ్చారుగా? ప్రయత్నిద్దాం. కానీ మీకు ఎవరిమీదనన్నా అనుమానంగా ఉందా?''

''నాకు ఎవరిమీదా అనుమానం లేదుసార్. అనుమానించటం మొదలుపెడ్తే నేను చాలామందిని అనుమానించాల్సి వస్తుంది. ఎందుకంటే 'భార్యా రూపవతీ శత్రుః' అన్నారు కదా? రూప రూపవతి. నేను మగవాడినేగాని పెద్ద అందగాడిని కాను''

''మీ భార్య శీలంపైన మీకేమన్న అనుమానం ఉందా?''

''నాభార్య అందగత్తె. నాకన్నా అందగాళ్ళతో ఆమె చనువుగా మాట్లాడితే నేను అనుమానించటం సహజం. కానీ అలాగని ఆమె శీలాన్ని శంకించకూడదు కదా? నేరాన్ని ప్రూవ్ చేయగలిగినప్పుడే అనుమానించాలన్నది నా మతం:''

''ఓ! ఐసీ! మీ భావన నాకర్థమయింది. మీరింక వెళ్లనచ్చు''.

సుధీర్ కదలలేదు.

''ఇన్‌స్పెక్టర్‌గారూ. నాదో అభ్యర్థన. రూపను వెదికిపట్టిందాకా ఈ కేసుకు పత్రికలలో ప్రచారం ఇవ్వవద్దు. అసలే గాయపడ్డ నా మనసుమీద ప్రచారం కారంచల్లినట్లు ఉంటుంది కదా?''

ఇన్‌స్పెక్టర్ గంభీరంగా నవ్వుతూ 'అలాగే' అన్నట్లు తలవూపేడు.

★——★——★

అర్ధరాత్రి. సిటీ నిద్రమత్తుతోజోగుతోంది.

సుధీర్ నివసించే ఫ్లాట్ ముందు జీప్ ఆగింది.

ఇన్‌స్పెక్టర్ రవీంద్ర జీపు దిగేడు. అతని వెనుక ఓ యువతి కూడా జీప్ దిగింది.

సుధీర్ ఫ్లాట్‌వద్దకెళ్లి తలుపు తట్టేడు రవీంద్ర.

లోపల లైట్లు వెలుగుతున్నాయి. కానీ తలుపు తెర్చుకోవటానికి ఓ పది నిముషాలు పట్టింది.

''మిస్టర్ సుధీర్. మీరు భార్య తప్పిపోయిన విచారంలో వున్నారనుకొంటాను'' అన్నాడు సుధీర్ గదిని కళ్ళతో పరిశీలనగా కలియచూస్తూ రవీంద్ర. అతని నాసికా పుటాలు ఏదో వాసనను పసిగట్టాయి.

''అవును ఇన్‌స్పెక్టర్. రూపలేకుండా నిద్రపోయే అలవాటు లేదు నాకు. అంచేత నాకు నిద్రపట్టలేదు. సో...కొత్త అలవాటు...కాస్తంత ఇప్పుడే పుచ్చుకున్నాను. జస్ట్ నిద్ర పట్టటానికి''.

''ఓ అలాగా! మద్యం వొంటరిగా పుచ్చుకుంటే మజా వుండదంటారే? మీరేమో చూడబోతే వొంటరిగా...అన్నట్లు మీ వర్క్‌ను డిస్టర్బ్ చేయలేదుకదా నేను-హఠాత్తుగా వచ్చి?''

''వర్కా! వర్కేమిటి?''

''వర్కంటే...ఐ మీన్...చే సే ప ని- చేస్తున్న పని-మద్యం సేవించడం కూడా వొక పనేకదా?''

''ఓ అంతేకదా?''

''కాక? ఇంకేమనుకున్నారు మీరు? అసలు విషయం. మావాళ్ళు వో యువతిని కనుగొన్నారు. పచ్చ పూలున్న చీరె...మీరుచెప్పిన గుర్తులన్నీ సరిపోయాయి. ఆమెను నలుగురు కల్సి రేప్ చేసినట్లున్నారు.ఆ షాక్ వల్ల ఆమె మాట్లాడలేకపోతోంది. ఆమె మీ భార్య రూప అని మా అనుమానం...'' రవీంద్ర సుధీర్ మొహంలోకి సూ టి గా చూస్తూ అన్నాడు.

''ఎక్కడుంది నా రూప? రేప్ చేయబడితే నేం? నా రూప- రూపే. ప్లీజ్. ఆమెను నాకు చూపించండి!''

ఇన్‌స్పెక్టర్ బయటికి వెళ్ళి క్షణం తర్వాత వో యువతిని వెంటబెట్టుకొని వచ్చాడు.

''ఈమె మీ రూపే కదూ?''

''కాదు- కానేకాదు. నా రూప ఎన్నటికీ యిలా వుండదు.''

ఆమెను బయటికి పంపించి వేసేడు రవీంద్ర.

''మీ భార్య రూప ఫోటో వొకటి చూపించగలరా? ఇలాంటి సందర్భాలలో మాకు ఇన్‌వెస్టిగేషన్ సులభంగా వుంటుందికదా?''

''అవుననుకోండి. కానీ మొదట్లోనే చెప్పేనుగదా? రూపకు ఫోటోలు తీయించుకోవటంపట్ల విముఖత వుంది ఎందుకో. పెళ్ళికి ముందు సంగతి నాకు తెలియదు. పెళ్ళయిన యీ ఆరు నెలలలో వొక్క ఫోటోను కూడా తీసుకోటానికి వుత్సాహం చూపలేదు. కాగా ఉన్న ఫోటోలన్నీ తగలెట్టేంది, పెళ్ళిఫోటోలు కూడా. ఆమె వర్ణనిచ్చానుగదా?''

''పోనీ ఆమె చేతి వ్రాతతో ఉన్న డైరీలు. వుత్తరాలు...''

''సారీ సర్! ఆమెకు డైరీలు రాసే అలవాటులేదు. తనకొచ్చిన వుత్తరాలను ఎప్పటికప్పుడు చించిపారేస్తుంది. జవాబులు రాయదు.''

''అలాగా! మీ భార్యది చాలా పెక్యూలియర్ మనస్తత్వమే! పోనీ కాలక్షేపానికి ఏం చేస్తుంటుంది?''

''పుస్తకాలు అద్దెకు తెచ్చుకొని చదువు తుంటుంది.''

''ఎలాంటి పుస్తకాలు...?''

''సెక్స్ పుస్తకాలు...''

దటీజ్ గుడ్. నేనోసారి మీ ఫ్లాట్ చూడవచ్చా? ముఖ్యంగా కిచెన్-''

''బై ఆల్ మీన్స్. రండి...''

సుధీర్ రవీంద్రకు గదులన్నీ చూపించాడు. మూడు గదుల ఇల్లు అది. బెడ్ రూమ్ చాలా బాగా, సెక్సీగా అలంకరించబడి వుంది. రవీంద్ర సుధీర్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

''పడకగది అలంకరణంతా రూప అభిరుచికి చిహ్నం. షి లైక్స్ టూమచ్ సెక్స్!''

''అలాగా?'' నిర్లిప్తంగా అన్నాడు రవీంద్ర.

''ఆమె సెక్స్యువల్ డిజైర్‌ను నేను ఎల్లప్పుడూ తీర్చగలనా అని భయం పుట్టేటంత 'యిది'గా ఉండేది, ఆమె బెడ్ రూమ్ ప్రవర్తన''

''అడగకుండా మీరే చెప్పేరే ఈ విషయం? ఈ విషయం ఎలా అడగటమా అని నేను సందేహిస్తున్నాను సుమా! మీరు చాలా సహృదయుల్లా కన్పిస్తున్నారు. థాంక్యూ'' అంటూ అతనో పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. తెర్చి చూశాడు.

''యిదేదో క్రయిమ్ ఫిక్షన్‌లాగా వుందే? మీరు క్రయిమ్‌ఫిక్షన్ ఎక్కువ చదువుతారా?''

''అప్పుడప్పుడూ. అదీ రూప కాపురానికొచ్చాకే అలవాటయింది. రూపకి సెక్స్ పుస్తకాల తర్వాత క్రయిమ్ ఫిక్షన్, థ్రిల్లర్స్ అంటే ఇష్టం''

''ఓహో! ఈ పుస్తకం మీద మీ పేరుంటేనూ! రూపకన్నా మీకే హెచ్చు ఇన్‌టరెస్ట్ అనుకొన్నా ... వంట రూపే చేసేదా?

''ఊ...ఆమే చేసేది. అది సహజంకదా?''

''మీట్‌ను కట్ చేసే కత్తిని కూడా చాలా శుభ్రంగా కడిగి ఉంచారే? కిచెన్‌ను అంత పరిశుభ్రంగా వుంచుతారా మీరు?''

''నేను కాదు. రూప...''

''ఇదేమిటి? టాయ్‌లెట్టా? షల్ ఐ యూజ్ యిట్ ఎ మినిట్...'' అతను వెళ్ళబోతే సుధీర్ వారించాడు.

''టాయ్‌లెట్ బెడ్ రూమ్‌లో వుందిగా. యూజ్ చెయ్యండి. ఇది యూజ్‌లోలేదు, చాలా రోజులుగా. పైగా తాళం కూడా రూప ఎక్కడో పారేసింది.''

''అయితే ఫర్వాలేదు లెండి. మీ మామగారి అడ్రస్ చెప్తారా?''

సుధీర్ మామగారి అడ్రసు వో కాగితం పైన రాసిచ్చాడు.

''మీకు ముందే చెప్పేనుకదా? మా మామ గారు హార్ట్ పేషెంట్. పైగా మతిమరుపు

మనిషి. నేనంటే ఆయనకు ప్రత్యేకంగా అయిష్టత. నా పేరు ఎత్తితే కస్సుమని అంటాడు. నన్ను నానా మాటలూ అంటాడు. రూపంటే ఆయనకు ఎక్కువ ప్రేమ. రూప ఇలా కన్పించకుండా పోయిందని తెలిస్తే ఆయన గుండె ఆగవచ్చు. కనుక ఆయనకీ విషయం తెలియనివ్వకండి.''

''అలాగే. థాంక్యూ...''

ఆరు నెలలయింది.

''రూప...నారూప ఆచూకీ తెల్సిందా సార్? ఎలాగైనా ఆమెను నాకు దక్కించండి సార్. ప్లీజ్... మీ ఋణముంచుకోను'' ఈ ఆరు నెలలలో వారానికోసారన్నా వచ్చి సుధీర్ రవీంద్రను ప్రాధేయపడ్తూనే ఉన్నాడు.

''సారీ మిస్టర్ సుధీర్. మా ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నాం. కానీ ఇంత వరకు అసలు చిన్న 'క్లూ' కూడా దొరకలేదు. అసలామెను కిడ్ నాప్ చేసేరో, చంపేరో... నేరస్తుడు చాలా ప్లేన్డుగా నేరాన్నిచేసినట్లు కన్పిస్తోంది. అయినా మా ధర్మం నెరవేరుస్తాం. కాస్త వోపిక పట్టండి. ప్లీజ్'' రవీంద్ర తల వంచుకొని అంటూనే వున్నాడు.

''రూపలేని యీ వూర్లో నేను వుండలేను సార్. ఏవేవో ఆలోచనలు...నన్ను నిద్ర పోనివ్వటంలేదు. మరో వూరికి మకాం మార్చేద్దామనుకొంటున్నాను.''

''ఏవూరు?''

''మద్రాసు.''

''విష్‌యూ ఆల్ ది బెస్ట్. చిరునామా ఇచ్చిపోతే మీ భార్య ఆచూకీ తెలియగానే తెలుపుతాను. లేకపోతే మా పోలీసు డిపార్టుమెంట్‌ను మీరు క్షమించాలి -''

సుధీర్ ప్రయాణ సన్నాహాలన్నీ చేసుకొన్నాడు. తెల్లవారిలేస్తే ప్రయాణం.

తెలతెలవారుతుండగా సుధీర్‌ను జీప్ శబ్దం డిస్టర్బ్ చేసింది.

''ఊ. రూప ఆచూకీ ఏమన్నా తెల్సిందా? ఈ సమయంలో వచ్చారు.''

''లేదు లేదు. అంత అదృష్టం కూడానా? యింకా కాస్త టయిమ్ వుందిగా? కూర్చోండి. చిన్న కథ చెప్తాను.''

''కథా! యిప్పుడు?''

''ఊ. మీకు క్రయిమ్ స్టోరీస్ యిష్టంకదా? జస్ట్, ఫ్యూ మినిట్స్...మీకీ కథ చెప్పి వీడ్కోలిద్దామనే వచ్చాను నేను.''

''చెప్పండి'' సోఫాలో కూర్చుంటూ అన్నాడు సుధీర్.

''సరిగ్గా మీ వయసువున్న యువకుడి కథే యిది'' అంటూ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర సిగరెట్టు వెలిగిస్తూ సుధీర్‌కు వొకటి ఆఫర్ చేసేడు. ఇద్దరి పెదిమలమధ్య సిగరెట్టు కాలుతోంది.

★—★—★

అతని పేరు - పోనీ మాటవరుసకు - సుధీర్ అనే అనుకొందాం.

సుధీర్‌కు మంచి పర్సనాలిటీ వుంది. ఆడవాళ్ళకు మాటలుచెప్పి మురిపించి బురిడీ కొట్టించటంలో అందెవేసిన చెయ్యి. తెలివిగల వాడు కూడా. అయితే ఆ తెలివి వంకర్లు తిరిగింది.

అంచేత ఆడవాళ్లను అతను ఆటబొమ్మలుగా పరిగణించేవాడు. ధనవంతులైన యువతుల్ని ఆకర్షించి వలలో వేసుకోటం అతని హాబీ. ముఖ్యంగా తనకన్నా పెద్దవాళ్ళను-కామ వాంఛలు తీరనివాళ్ళను-సెక్సువల్ పెర్‌వర్ట్స్‌ను-అతను ఇట్టే కనిపెట్టి పట్టేసేవాడు. ఏ గుర్రాలని ఎలా పరిగెత్తించాలో జాకీకి తెల్సినట్లుగా అతనికి ఏ స్త్రీని ఎలా లొంగతీసుకోవాలో తెలుసు.

అలాంటి స్త్రీలను లొంగతీసుకొని-వాళ్ళదగ్గిర డబ్బులాగి జల్సాలు చేయటం అతని వృత్తి. అతనలాగేవుంటే యీ కథ వుండేదే కాదు. కానీ అతనికి వివాహం చేసుకోవాలనిపించింది-వో రోజు హఠాత్తుగా.

అయితే ఆ వూర్లో తనకెవరూ పిల్లనివ్వరని తెలుసు.

అంచేత అక్కడికి చాలా దూరంగావున్న వూరికెళ్ళి అక్కడొక అమ్మాయిని తన భార్యగా ఎంచుకొన్నాడు.

ఆ అమ్మాయి పేరు... పేరేదో వుంది... మర్చిపోయాను.

పోనీ ప్రస్తుతానికి ''రూప'' అని అనుకొందాం.

రూప అతని వలలో చిక్కుకుంది. తండ్రిని బలవంతంగా అంగీకరింపచేసి సుధీర్‌ను పెళ్ళి చేసుకుంది.

పెళ్ళప్పుడు మామగారు ఏదో శక్తికి తోచినట్లు కట్నం యివ్వబోతే నలుగురి ఎదుటా తాను కట్నం తీసుకోనని, కట్న దురాచారానికి తాను వ్యతిరేకినని ఎలుగెత్తి ప్రకటించాడు. కానీ పెళ్ళయిన మర్నాటి నుంచీ డబ్బు కోసం మామను పీడించసాగేడు.

అలా కొంత కాలం మామ రక్తం పీల్చి పిప్పి చేశాక రూపతో సహా అతను మామగారి వూరు నుంచి మకాం ఎత్తేసేడు.

తాను ఎవరికీ తెలియని కొత్త వూళ్లో రూపతో సహా మకాం పెట్టేడు. అక్కడ తన మామూలు హాబీ కొనసాగించాడు.

ఎన్నెన్నో చిన్న చిన్న చేపలు అతని వలలో చిక్కుకొన్నాయి.

కానీ యిప్పుడు అతని దాహం పెరిగింది. వో బంగారు చేపను వలవేసి పట్టేడు. ఆ బంగారు చేపను పెళ్ళి చేసుకొంటే బంగారమంతా తనదే. కానీ ఆ బంగారు చేప రూపకు డైవోర్స్ ఇస్తేనే కాని పెళ్ళి చేసుకోనని కండిషన్ పెట్టింది.

రూప ''డైవోర్స్''కు అంగీకరించలేదు. బ్రతిమలాడేడు- ప్రాధేయపడ్డాడు. బెదిరించాడు. రూప లొంగలేదు.

అతను దేశవిదేశాల క్రయిమ్ కథలు అనేకం చదివేడు. కానీ స్వయంగా హత్య ఎన్నడూ చేయలేదు. చేయాలన్న ఆలోచన సర్దాగా అనిపించింది.

తను చేయబోయే హత్య చాలా కళాత్మకంగా, యింత క్రితం ఎవ్వరూ చేయని రీతిలో

ఎవరికీ దొరకని రీతిలో వుండాలని అతనికి కోరిక కలిగింది. అతను అనేక పుస్తకాలు చదివేడు. జాగ్రత్తగా వొక పథకాన్ని తయారు చేసేడు.

అతని చేతిలో వున్న మహత్తర ఆయుధం సెక్స్. ఆ సెక్స్ క్రియలోనే రూపను హింసించి చంపేడు. ఆమెకు సంబంధించిన ఫొటోలు ఉత్తరాలు, డైరీలు, బట్టలు... అన్నీ కాల్చివేసి బూడిద చేసి సింక్‌లోకి నీళ్ళతో పాటు పంపించారు. శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోసేడు. అది చెడకుండా ద్రవం పూసేడు. ఆ ముక్కల్ని అందుకని ప్రత్యేకంగా ముందే తయారుచేసిన పెట్టెలో పెట్టి బాత్‌రూమ్‌లో బిగించాడు. తలుపుకు తాళం వేసేడు.

అదేరోజు సరిగ్గా ఆ వూళ్లో సెంటర్లో తన భార్య వయసేవున్న వో స్త్రీకి, తన భార్య పెళ్ళినాటి ఫోటోలో వున్న చీరెను కట్టబెట్టి, కిరాయి మనుషుల్ని వినియోగించి ఆమెను అందరూ చూస్తుండగా ఎత్తుకుపోయేలా చేసేడు. అలా రూప ఎవరిచేతో అపహరించబడిందని పోలీసులకు రిపోర్టిచ్చాడు. సింపతీ సంపాదించాడు.

రవీంద్ర కథ చెప్పటం ఆపేడు.

''సిగరెట్ ప్లీజ్'' తను సిగరెట్ వెలిగించుకోబోతూ సుధీర్‌కు సిగరెట్ ఆఫర్ చేసేడు.

''నో...సారీ... నాకు ట్రెయిన్ టయిమ్ అయింది.''

''అయితే బయలుదేరుదాం. నేనూ వస్తాను గదా సెండ్ ఆఫ్ యివ్వటానికి? కాని నేనే సుధీర్ అనుకోండి. మీరే పోలీస్‌ఆఫీసర్ రవీంద్ర అనుకోండి. మీరీ కేస్‌ను ఎలా ''డీల్'' చేస్తారు? చెప్తారా?''

'చెప్తాను. తప్పక చెప్తాను. ఇక చెప్పక తప్పదుగా-? ఇదుగో ఇలా...'' సుధీర్ ఛటుక్కున జేబులో నుంచి పిస్టల్ తీసి రవీంద్రకు గురిపెట్టేడు.

రవీంద్ర ఆరంభంలో కంగారుపడ్డా నిలదొక్కుకొని నవ్వేడు.

''మిస్టర్ ఇన్స్‌పెక్టర్. మీ అతితెలివితేటలు ఇక చాలించండి. మీ కథలో సుధీర్, ఈకథలో సుధీర్ ఒక్కడే. కానీ ఆ విషయంమీరు ఏ ఆధారాలతో తెల్సుకొన్నారు? రూపను చంపింది నేనే. కానీ దాన్ని మీరు కోర్టులో ఎలా ప్రూవ్ చేద్దామనుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు మీరిచ్చే సమాధానాలమీదనే మీకు నేను విధించబోయే శిక్ష ఆధారపడివుంటుంది.''

''సుధీర్ అనే వ్యక్తియొక్క నిజస్వరూపం తెలుసుకోడానికి సహాయపడింది ఇద్దరు-ఒకడు సుధీర్, రెండు-అతని మామగారు. సుధీర్ కొన్నాళ్ళక్రితం భార్యతోసహా మామగారింటికి వెళ్ళాడు. అక్కడ తన భార్య ఫొటోలను తదితర ఆధారాలను లేకుండా దొంగిలించటానికి. కానీ అప్పుడు మామగారు అతనికి సంబంధించిన కొన్ని కాగితాలను తస్కరించాడని అతనికి తెలియదు. అన్ని ఫొటోలు దొంగిలించినా ఒక్క ఫొటో నెగెటివ్ మాత్రం మామగారివద్ద మిగిలిపోయింది. ఆ ఫోటోను సెంటర్‌లో చూపించి ఆరోజు అపహరించుకుపోయింది ఈయనేనా అని అడిగితే కాదన్నారు, అక్కడ దృశ్యాన్ని చూచినవాళ్లు. ఆ తర్వాత అలా డూప్‌వేషాలు వేయగల క్రిమినల్స్‌ను పట్టుకొని నిజం కక్కించటం పోలీసులకు తెలీదా? కాగా సుధీర్ స్వయంగా కొన్ని తప్పులు చేసేడు.

ఇన్‌స్పెక్టర్‌కి ఇల్లంతా చూపించి బాత్‌రూమ్ చూపించకపోవటం- పైగా చాలా రోజులుగా యూజ్‌లోలేదని అబద్ధమాడటం అందులో ముఖ్యమయినవి. ఆ రాత్రి పోలీస్ బలగం బాత్‌రూమ్‌లోకి ప్రవేశించి పెట్టెలో శవం ముక్కల్ని తస్కరించి డబ్బాలో రాళ్లు నింపిపోయారని పాపం నేరస్తుడికి తెలియదు.''

సుధీర్ మొహం మొట్ట మొదటిసారిగా పాలిపోయింది.

''ఇక నీరెండో ప్రశ్నకు సమాధానం'' అంటూ రవీంద్ర రెండుసార్లు ఆపి ఆపి చప్పట్లు కొట్టాడు.

ఇంటి లోపలి నుంచి వొక యువతి-బయటి నుంచి మరో యువతి-

వొక్కసారే ప్రవేశించారు. వారిని చూసి విస్తుపోయాడు సుధీర్.చేతులు వణికేయి. అతని చేతికి వో ఫోటో అందించాడు రవీంద్ర.

''నీ యింటిలో నుంచి వచ్చిన ఆమె నువ్వు పెళ్ళి చేసుకొందామనుకుంటున్న బంగారు పిచ్చుక. నీ అసలు రంగు తెల్సి ఎప్పుడో ఈ కేసులో మాకు హెల్పర్‌గా, అప్రూవర్‌గా మారింది. ఇక బయటి నుంచి వచ్చిన ఆమె-తప్పిపోయిన రూప. పచ్చపూల ఎర్ర చీర-అదిగో గుర్తుపట్టలేదా? ఇంకా ఎందరో వున్నారు మరి!''

''యూ బిచెస్...''

సుధీర్ కోపంగా అంటూ పిస్టల్ పేల్చాడు. అటూ యిటూ-

రవీంద్ర యిల్లు అదిరిపోయేలా నవ్వేడు.

''మిస్టర్ సుధీర్! పిచ్చెక్కిందా మీకు? నీచాత్మకంగా హత్య చేయాలనుకొన్న మీకు బొత్తిగా బుర్ర లేనట్టుందే! మీ యింట్లో మా అప్రూవర్ వుండగా మీ పిస్టల్‌లో నిజమైన తూటాలు వుంటాయా?''

సుధీర్ చేతిలో నుంచి పిస్టల్ క్రిందకి జారింది.

''రవీంద్రా! నేను వోడిపోయాను. లొంగి పోతున్నాను.

యూ ఫ్రూవ్డ్ దట్ అయామ్ ఎ మేడ్ మేడ్ మేడ్ ఫూల్.

నా ఇగో-నా అహం - నన్ను నాశనం చేసింది.

ఈ వెర్రి వెధవకు ఈ శాస్తి కావల్సిందే!''

సుధీర్ అలా ఆవేశంగా అరుస్తూ అరుస్తూ కుప్పగా క్రింద కూలబడ్డాడు.

పల్లకి సచిత్ర వారపత్రిక — 17.1.85